క్లుప్తంగా

పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి టి.వేదానంద్ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలేజీ అల్యూమిని అసోసియేషన్ ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. విద్యార్థి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం తమవంతు సాయంగా రూ.50 వేలను విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్,అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత తరిగొండ జట్టు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా తరిగొండ జట్టు నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తరిగొండ జట్టు రామాపురం జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.25000. రన్నరప్ జట్టుకు రూ.15000 నిర్వాహకులు అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెద్దతిప్పసముద్రం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వివిధ క్రీడా పోటీలకు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చేస్తామని పీడీ జవహర్ అన్నారు.

పాడి ఆవుల పోషణతో మెళుకువలు ముఖ్యం

తంబళ్లపల్లె: ఆవుల పోషణలో పాడి రైతులు మెళుకువలు పాటించాలని మండల పశువైద్యాధికారిణి సుజశ్రీ తెలిపారు. మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లె, కొత్తకురవపల్లెలో శుక్రవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పాడి ఆవుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. 68 పశువులకు చికిత్సలు అందించారు. 10 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. గాలికుంటు టీకాలు వేశారు. పాడిరైతులకు మినిరల్ మిక్చర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ రాధ, వెటర్నటీ అసిస్టెంట్లు సుకన్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరుపేద దళితులకు భూపంపిణీ చేయాలి

గుర్రంకొండ: భూమిలేని నిరుపేద దళితులకు మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్(లిబరేషన్)పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నడిమిఖండ్రిగ ఎగువ దళితవాడలో పర్యటించారు. దళితులతో కలసి ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రమణ, నరసింహులు, నాగప్ప పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో శుక్రవారం జరగాల్సిన సమావేశాన్ని ఎంపీడీఓ శంకరయ్య వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు బి.కొత్తకోట మండల మీట్ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే 10 గంటలకే టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి వర్గీయులు మండల కార్యాలయం చేరుకుని గేటు వద్ద బైఠాయించారు. మండల సమావేశం నిర్వహించవద్దని నినాదాలు చేశారు. కార్యాలయం లోపల ఎలాంటి ఆందోళన చేయరాదని, బయటకు వెళ్లాలని పోలీసులు కోరినా టీడీపీ నాయకులు వినలేదు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. టీడీపీ నేతల తీరును నిరసిస్తూ ఎంపీపీ కొద్దిసేపు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

పీలేరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేష్‌బాబు కోరారు. శుక్రవారం బంగారుపాళెంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 117న రద్దు చేయాలని తెలుగు మీడియంను పునరుద్ధరించాలని కోరారు. మెర్జింగ్ తరగతులు వెనక్కు పంపాలని, ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలని, విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కామన్ సర్వీస్ రూల్స్‌పై ప్రభుత్వం చొరవ చూపి పరిష్కారం దిశగా ప్రయత్నం చేయాలన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

కలికిరి: ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకిపురం సీడీపీఓ భారతి మాట్లాడుతూ విద్యార్థినులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణలత, భ్రమరాంభిక, ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ టీచర్లు రెడ్డిరాణి, ప్రమీలాబాయ్, రాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హామీలు.. హాంఫట్

- నహజ వనరులను దోచేస్తున్న టీడీపీ వర్గీయులు
- ప్రభుత్వ శాఖల్లో పడకేసిన పాలన
- కార్యాలయాల్లో ఎమ్మెల్యే అనుచరులదే రాజ్యం
- అధికారంలోకి వచ్చిన వందరోజుల పాలన తీరు

మదనపల్లె: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన హామీల విస్మరణకే పరిమితమైంది. ఒక్క పెన్షన్ పెంపు మినహా సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే ఏ పథకం అమలు కాలేదు. సూపర్ సిక్స్‌తో అద్భుతాలు చేసేస్తామన్న టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను విశ్వసించిన ప్రజలు నమ్మి అధికారం ఇస్తే.. వచ్చి వంద రోజులవుతున్నా.. ఇప్పటి వరకు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం ఒక్కటైనా చేయలేదు. కానీ.. అధికారంలోకి వచ్చిందే ఆలస్యమన్నట్లుగా.. సంపాదనే ధ్యేయంగా టీడీపీ వర్గీయులు ప్రకృతి వనరులను కొల్లగొడుతూ, మాఫియాగా తయారై దోపిడీకి పాల్పడుతున్నారు. పంచాయతీ సచివాలయం నుంచి సబ్ కలెక్టరేట్ వరకు.. పోలీస్‌స్టేషన్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు.. వారిదే హవా నడుస్తోంది. టీడీపీ పాలనలో సామాన్యుడికి న్యాయం జరగకపోగా, అరాచకం, అవినీతి రాజ్యమేలుతోంది. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష నాయకుడి హోదాలో చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్కటీ నెరవేర్చలేకపోయారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలుపై సాక్షి ప్రత్యేక కథనం.



మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎన్నికల సమయంలో ఇచ్చిన మదనపల్లె ఎన్నికల మేనిఫెస్టో-2024

500 బెడ్స్‌తో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లె నియోజకవర్గానికి ఆరోగ్యవరం సమీపంలో 96 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీని మంజూరు చేసి, 2024-25 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించాలని దాదాపు 75 శాతం పనులు పూర్తి చేస్తే.. టీడీపీ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ఉద్దేశంతో ఈ ఏడాది కాలేజీని ప్రారంభించకుండా అడ్డుకుంది. 200 పడకలు ఉన్న మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని, 400 పడకలతో సర్వజన బోధనాసుపత్రిగా మారిస్తే.. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించి హడావిడి చేయడం తప్ప, ఆస్పత్రిలో సమకూర్చిన సౌకర్యాలు లేవు. కనీసం అభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేయలేదు.

50 ఎకరాల్లో ఐటీ హబ్, 20 ఎకరాల్లో స్పోర్ట్స్ సెంటర్

వీటి గురించి ఎన్నికల సమయంలో ప్రస్తావన తప్ప ఇప్పటి వరకు ఊసే లేదు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదు. అధికారంలోకి వచ్చిన రెండోరోజే ప్రెస్‌మీట్‌లో ఫ్లై ఓవర్‌లు నిర్మించి, రోడ్లను వెడల్పుచేసి ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడేస్తామన్న ఎమ్మెల్యే.. వంద రోజులైనా సమస్య పరిష్కారానికి కృషిచేయలేదు.

యువగళంలో నారాలోకేష్

ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా 500 కి.మీ. మండలంలోని సీటీఎం క్రాస్‌కు చేరుకున్న సందర్భంగా అధికారంలోకి వస్తే మదనపల్లె నియోజవర్గానికి చేయబోయే అభివృద్ధిపై శిలాఫలకం ఆవిష్కరించారు. టమాటా రైతుల కోసం ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే అనుమతులు ఇస్తామని శిలాఫలకంలో పేర్కొన్నారు. అయితే... ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.

రూ.1000 కోట్లతో మదనపల్లె అభివృద్ధి

మదనపల్లె ఔటర్ రింగ్‌రోడ్డు, బైపాస్ టు బెంగళూరు రోడ్డు ఫ్లై ఓవర్, మదనపల్లె-నిమ్మనపల్లె, రామసముద్రం డబుల్‌రోడ్, డ్రైనేజీ వ్యవస్థ, ఆర్‌టీసీ బస్టాండ్, చిత్తూరుబస్టాండ్, బెంగళూరు బస్టాండ్ బ్రిడ్జి, ప్రతి వార్డులో పార్కు, సమ్మర్ స్టోరేజీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే వీటికి సంబంధించి అధికారులతో సమీక్ష, మీడియా సమావేశంలో ప్రస్తావన తప్ప ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

బీటీ కళాశాల ఉన్నతస్థాయికి అభివృద్ధి: మదనపల్లె పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన బీటీ కళాశాలను ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే కాకుండా యూనివర్సిటీగా ప్రకటిస్తూ జీఓ విడుదల చేశారు. ఈ విషయం తెలిసినప్పటికీ ఎన్నికల సమయంలో యూనివర్సిటీగా ప్రకటించి ఉన్నతస్థాయికి అభివృద్ధి చేస్తామన్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు పట్టించుకోవడం మానేశారు.

చేనేత కార్మికుల పన్నులు డొమెస్టిక్ పరిధిలోకి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఏడాదికి రూ.24 వేలు చొప్పున వైఎస్సార్ నేతన్న నేస్తం అందించింది. టీడీపీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల మగ్గాల ఇళ్లపై విధిస్తున్న పన్నులను కమర్షియల్ కేటగిరీ నుంచి డొమెస్టిక్ పరిధిలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చి.. ఏమీ ఎరగనట్లు ఊరకుండిపోయారు.

కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేస్తాం

రేషన్‌కార్డుల ఊసే లేకపోవడం గమనార్హం.

సీటీఎం, కోమటివాని చెరువుల అభివృద్ధి

మదనపల్లె మండలానికి తలమానికమైన సీటీఎం చెరువు, పట్టణ ఐకానిక్‌గా పిలిచే కోమటివానిచెరువును బోటింగ్, లేక్ వ్యూ పార్క్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అయితే కోమటివానిచెరువులో కలిసే వ్యర్థాలతో వచ్చే దుర్వాసన, మురుగు ప్రవాహాన్ని అరికట్టలేకపోయారు.

రాయితీపై ఉలవ విత్తనాలు

ములకలచెరువు: ఖరీఫ్ రైతులకు ప్రత్యామ్నాయ పంటల ద్వారా సాగు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో ఉలవ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ లీలాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కేజీల బ్యాగు రూ.174కే పంపిణీ చేస్తామన్నారు. 100 క్వింటాళ్లు ఉలవలు కార్యాలయానికి వచ్చినట్లు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

మదనపల్లె సిటీ: సకాలంలో వర్షాలు కురిసి సస్యశామలంగా పాడిపంటలతో ఉండాలని కోరుతూ మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ దత్త ఆశ్రమంలో శుక్రవారం చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్త విజయానంద తీర్థస్వామీజీ చండీయాగంలో పాల్గొన్నారు. విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు. పిల్లలకు క్రియా యోగ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమ నిర్వాహకులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

రామసముద్రానికి స్టూడెంట్స్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: రామసముద్రానికి శుక్రవారం నుంచి స్టూడెంట్స్ స్పెషల్ బస్సు నడిపారు. గతంలో కట్టుబావి వద్ద విద్యార్థులు స్టూడెంట్స్ స్పెషల్ బస్సు నడపలేదని ఆందోళన చేశారు. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. ప్రతి రోజు ఉదయం 6.15 గంటలకు మదనపల్లెలో బయలుదేరి, రామసముద్రంకు 7.30 గంటలకు చేరుకుంటుందని డీఎం తెలిపారు. అక్కడి నుంచి 7.30 గంటలకు బయలుదేరి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 3.15 గటంలకు మదనపల్లెలో బయలుదేరి రామసముద్రంకు సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి 4.45 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందన్నారు.

గల్ఫ్ బాధితురాలికి సాయం

నిమ్మనపల్లె: కుటుంబ పోషణ కోసం, అనారోగ్యంతో బాధపడుతున్న భర్తను కాపాడుకునేందుకు కువైట్(గల్ఫ్) వెళ్లి నరకయాతన అనుభవించి, ప్రభుత్వ సహకారంతో ఇంటికి చేరుకున్న బాధితురాలు మైమున్‌బీకి జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఈతకట్ట చంద్రశేఖర్ ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం సాయంత్రం ఆమె కువైట్ నుంచి ఇంటికి చేరుకోగా, శుక్రవారం వెంగంవారిపల్లె పంచాయతీ సింగంవారిపల్లెలోని ఆమె స్వగృహానికి జనసేన నాయకులు వెళ్లి బాధితురాలికి భరోసా కల్పిస్తూ, తమ వంతు సాయంగా రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు రమణ, శివ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనం

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు ఐదుగురికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ మెరిట్ స్కాలర్ షిప్‌లు అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గుర్రంకొండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అక్టోబర్ 2 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రమణ్యం, పీడీ రమేష్, హెడ్మాస్టర్ సమ్మర్‌తార్, సర్పంచ్ రౌనఖ్, పంచాయతీ కార్యదర్శి మణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని అగర్వాల్ హెల్త్ కేర్ మేనేజర్ శివ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు నిర్వహించారు.హెల్త్‌కార్డులు కూడా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. డీఎం మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డిపోలో మూడు నెలలుగా ప్రమాదాలు లేవని, ఈపీకె, ఓఆర్,కెఎంపిఎల్ రీజియన్‌లో మొదటి స్థానం ఉన్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛతా సేవ పక్షోత్సవాలు పురస్కరించుకుని డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మదనపల్లె మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తట్టివారిపల్లె, పోతబోలు పంచాయతీల్లో సర్పంచ్‌లు సిద్ధలదీప, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటినట్లు తెలిపారు. కురవంకలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పసుపులేటిచలపతి స్వచ్ఛత హి సేవలో..తల్లి పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా, తన తల్లి పసుపులేటి చెన్నమ్మ పేరుతో మొక్కను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ షబానా, బోయ పాటిమురళీ, వార్డు మెంబర్ నాగరాజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


గుర్రంకొండ: ఖండ్రిగ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, మాజీ సర్పంచ్ వెంకటరమణరెడ్డి, సెక్రటరీ బాను మూర్తి, స్కూల్ చైర్మన్ కృష్ణప్ప మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రేహ్మాన్, సర్వేయర్ శ్రీనివాసులు, పల్లవి, స్వప్న, లావణ్య, హరి, రామ్మూర్తి, అమర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ తల్లి పేరిట మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంపీడీఓ మనోహర రాజు అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వాల్మీకిపురం పంచాయతీలో చెత్త కుప్పలను, మురికి కాలువలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి శివమోహన్, ఈవోపిఆర్‌డి శ్రీనివాసులు, పిఆర్ ఏఈ కమలాకర్ రెడ్డి, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో యాదవేంద్ర అన్నారు. శుక్రవారం కేవీపల్లెలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్. గఫూర్, ఏవో శ్రావణి, ఏపీవో నాగరాజ, పంచాయతీ కార్యదర్శి గీత, మోడల్‌స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఒక మొక్క నాటి సంరక్షించాలని ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపడ్డిపల్లె రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ మహేశ్వర్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి ప్రజలకు సూచించారు. స్వచ్ఛత మి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల సహకారంతో విద్యార్థులతో ర్యాలీలు, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కేఎస్ బాలాజీతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ: మొక్కల తోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్వచ్ఛత హా సేవా కార్యక్రమంలో భాగంగా కలకడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్యారీజాన్, ఎంపీటీసీ సభ్యులు ముభారక్, మండల కో ఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, యూటీపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తదితరలు పాల్గొన్నారు.

రైతుబజార్ పనులు పూర్తి చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: పట్టణంలోని సంతగేటు సమీపంలో పునఃప్రారంభించనున్న రాజీవ్ రైతుబజార్‌కు సంబంధించి జరుగుతున్న పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 30లోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న రైతుబజార్ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలిచ్చారు. రైతుబజార్‌కు డోర్ల ఏర్పాటుతో పాటుగా, లైటింగ్, మరుగుదొడ్ల నిర్మాణం చేయాలన్నారు. అంతకుముందు తట్టివారిపల్లెలో ఎన్‌హెచ్-71 విస్తరణ పనుల్లో భాగంగా తట్టివారిపల్లె జంక్షన్‌లో నిర్మించనున్న ఫ్లై ఓవర్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పరిహారం ఇచ్చాకే పనులు చేయాలని స్థానికులు నిరసన తెలిపిన నేపథ్యంలో నిర్వాసితులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లు ఉన్న స్థానంలో గతంలో కెనాల్ ఉన్నట్లు సర్వే రికార్డులు తెలుపుతున్నాయని, రెవెన్యూ అధికారులతో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, పరిహారం చెల్లింపును పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ఖాజాబీ, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, నేషనల్ హైవే అధికారులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఝరికోన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పీలేరు: ఝరికోన ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శుక్రవారం పీలేరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝరికోన కార్మికులకు 2023 నవంబర్ నుంచి జీతాలు చెల్లించలేదని, జీతాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు నెల నెలా జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీతాలు కాంట్రాక్టరు ద్వారా చేతికి ఇవ్వకుండా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు టి.ఎల్.వెంకటేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఝరికోన ప్రాజెక్టు కార్మికులతో కలసి ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సెక్యూరిటీ సిబ్బందిపై ఆర్‌ఎంఓకు ఫిర్యాదు

మదనపల్లె: మదనపల్లె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సెక్యూరిటీ మహిళా విభాగం సిబ్బందిపై ఆసుపత్రికి వచ్చిన ఆశా కార్యకర్తలు శుక్రవారం ఆర్‌ఎంవో ప్రసాద్ రాజుకు ఫిర్యాదు చేశారు. గర్భవతులను కాన్పుల నిమిత్తం తాము ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకువస్తే, ఆశా వర్కర్లను ఆసుపత్రి లోపలికి సెక్యూరిటీ మహిళా విభాగం సిబ్బంది అనుమతించడం లేదని వాపోయారు. దురుసుగా మాట్లాడుతూ వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది తీరుని నిరసిస్తూ అధికారులను నిలదీశారు. అంతలో ఆర్‌ఎంవో ప్రసాదరాజు ఆశ వర్కర్లతో మాట్లాడారు. వారి సమస్యలను విని వెంటనే, ఆరోపణలు ఎదుర్కొన్న మహిళ సెక్యూరిటీ జ్యోతిని అక్కడికి పిలిపించి విచారణ చేశారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆశా వర్కర్లకు సర్ది చెప్పారు. దీంతో వారు సూపరింటెండెంట్ చాంబర్ వద్ద నుంచి వెళ్లిపోయారు.


సెక్యూరిటీ మహిళా విభాగ ఉద్యోగి జ్యోతిని విచారణ చేస్తున్న ఆర్‌ఎంవో ప్రసాదరాజు

In the Court of the Principal Senior Civil Judge, Madanapalle
I.A. 263/2020 in O.S.99/2014
Settipalle Chandrasekhar and Others ...Petitioners Plaintiffs
K.Amaranarayna and Others ...Respondents Defendants

I.A.Notices to Respondents 15, 16 and 30 in I.A.263/2020 in O.S.99/2014

R15 : S.Jayalakshmi W/o Anjaneyulu
R 16: Kummara Manisri W/o Sreenivasulu
R15, R16 are resinding at Bandakadapalle H/o Vempalle (P.O), Madanapalle Mandal, Annamayya (Dt).
R 30: Bandaru Ramanamma D/o Gurrappa, Guttakindapalle H/o Vempalle (P.O), Madanapalle Mandal, Annamayya (Dt), (A.P)

పై దావాలోని I.A.263/2020 మనవిలో మీకు అనగా 15, 16, 30 రెస్పాండెంట్లకు అనేక మార్లు కోర్టు మరియు పోస్టు ద్వారా I.A.నోటీసులు పంపగా మీరు తీసుకొనక వృథా కాలయాపన దురుద్దేశ్యపూర్వకముగా చేయుచున్నారు. కాన పై దావాలోని I.A.263/2020 మనవిలో పై తెల్పిన కోర్టులో నేరులో గానీ లేక నిర్ణీత అడ్వకేట్ ద్వారా గానీ **27.09.2024వ తేదిన ఉదయం 10.30 గంటలకు** హాజరగుటకుగాను వాయిదాయున్నది. మీరు పై వాయిదాకు హాజరు కానంతట కోర్టు వారు మీ పరోక్షమున తగు ఉత్తర్వులు పాలించెదరని తెలియ పరచడమైనది.

// By order of the Court //

మదనపల్లె 19.09.2024

సరస సుబ్రమణ్యం, B.A., LL.B., న్యాయవాది, డో.నెం.2-413-సి-2, రామాలయం వీధి, (సొసైటీ కాలనీ) మదనపల్లె-517325.

పేదవాడికి అండగా నిలిచే ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా పేదవాడికి అండగా నిలుస్తూ, ఇది మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన స్వగృహంలో టీడీపీ కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలపై ఈనెల 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు నియోజకవర్గంలో నిర్వహించనున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 21వ తేదీన పట్టణంలోని మాలిక్ ఫంక్షన్‌హాల్, మదనపల్లె అర్బన్‌పరిధిలో, 23న మదనపల్లె మండలం పోతబోలు, 24న నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె, 25న రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె, 26న మదనపల్లె మండలం సీటీఎం-2లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాదెళ్ల శివ, సంగంశ్రీనివాసులు, రాటకొండనవీన్‌చౌదరి, పఠాన్‌ఖాదర్‌ఖాన్, శ్రీరామమురళీ పాల్గొన్నారు.

దళిత వ్యతిరేకిగా కూటమి ప్రభుత్వం

- వంద రోజుల్లో దమనకాండ
- నిర్లక్ష్య వైఖరి కనపరుస్తున్న పోలీసులు, ప్రజా ప్రతినిధులు
- బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి జయంతి సందర్భంగా ఈ నెల 17న పట్టణంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి డీఎస్పీ దర్బార్ కొండయ్యానాయుడు అనుమతి ఇచ్చి, ర్యాలీ ప్రారంభానికి ముందు హఠాత్తుగా అనుమతి రద్దు చేస్తున్నట్లు తెలిపారన్నారు. అప్పటికే ర్యాలీకి వందల సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కలిసి శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి, జేసీఎం ఫంక్షన్ హాల్‌లో బీసీ అసెంబ్లీ వేదికకు వెళ్లడం జరిగిందన్నారు. పెరియార్ లాంటి మహనీయుని జయంతిని జరిపిన బీఎస్పీ నాయకులపై టీడీపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం అంటే బడుగు, బలహీన వర్గాల గొంతును అణచి వేయడమేనన్నారు. పట్టణంలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, టీడీపీ నాయకుల ఫొటోలు పెట్టుకుని ప్రధాన రహదారులపై గంటలసేపు ఊరేగింపులు చేస్తున్న టీడీపీ నాయకులకు లేని ఆంక్షలు.. హక్కుల నాయకుడు పెరియార్ జయంతికి ఎందుకని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో దళితులపై దాడులు పెరిగాయన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో కేవలం 30 రోజుల వ్యవధిలోనే సుమారు 6 చోట్ల దళితులపై దాడులు జరిగాయన్నారు. కొన్ని కేసుల్లో పోలీసులు కావాలనే జాప్యం చేయడమే కాకుండా నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించలేదన్నారు. దళితులపై దాడులు రోజురోజుకీ పెరుగుతుంటే అరికట్టాల్సిన డీఎస్పీ దర్బార్ కొండయ్యానాయుడు, అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పట్టించుకోకపోగా, దాడులకు పాల్పడిన వారికి పరోక్షంగా సహకారం అందిస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీతో జతకట్టినప్పుడే ప్రజలు గ్రహించి ఉండాల్సిందని, నేడు దళితులపై జరుగుతున్న దాడులు టీడీపీ నాయకుల ప్రోత్సాహంతోనే జరుగుతున్నాయన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, చంద్ర, మల్లికార్జున, దంపెట్లశివ, మహేష్, గూడుపల్లి శివ, అరుణ్, ప్రశాంత్, సంధ్య, కన్నయ్య, రెడ్డెప్ప, సారథి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్